విపత్కర పరిస్థితుల్లో జాగ్రత్త

అల్గునూర్‌లో కవాతు చేస్తున్న పోలీసులు

తిమ్మాపూర్, మే10: ప్రజలు విపత్కర పరిస్థితుల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ సూచించారు. సర్కిల్ పరిధిలోని ఎస్ఐలతో కలిసి మండలంలోని అల్గునూర్, ఎల్ఎండీ, మోగిలిపాలెం గ్రామాల్లో పోలీస్ సిబ్బంది కవాతు నిర్వహించారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న నేపథ్యంలో ప్రజల్లో అభద్రతాభావం తొలగించి, విశ్వాసం నింపడానికి కవాతు చేసినట్టు సీఐ సదన్ కుమార్ తెలిపారు. అలాగే ఎల్ఎండీ ఎస్ఐ వివేక్ అల్గునూర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. అనుమానితుల వివరాలు నమోదు చేసుకున్నారు. కవాతులో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతను చాటాలి

చొప్పదండి, మే 10: భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న నేపథ్యంలో కుల మతాలకు అతీతంగా సోదర భావంతో ఉంటూ ఐక్యతను చాటాలని చొప్పదండి సీఐ ప్రకాశ్ గౌడ్ సూచించారు. చొప్పదండి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరూ సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మొద్దని, రెచ్చగొట్టే ప్రసంగాలు, సోషల్ మీడియా పోస్ట్‌లు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మనీషా, పీస్ కమిటీ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

మానకొండూర్, మే 10: మండల కేంద్రంలోని పల్లెమీద చౌరస్తా వద్ద కరీంనగర్–వరంగల్ రహదారిపై, తూర్పు దర్వాజ వద్ద మానకొండూర్ సీఐ సంజీవ్ ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా సిబ్బంది కార్లు, ద్విచక్రవాహనాలను ఆపి తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి కిట్స్‌లో ఎన్‌సీసీ శిక్షణ క్యాంపు

హుజూరాబాద్ రూరల్, మే 10: మండలంలోని సింగాపూర్ కిట్స్ కళాశాలలో ఈ నెల14 నుంచి 25 వరకు ఎన్‌సీసీ జాతీయస్థాయి అడ్వాన్స్డ్ లీడర్‌షిప్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ లెఫ్టినెంట్ కల్నల్ ఏకే జయంత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఈ క్యాంపు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో ఎన్‌సీసీ కెడెట్లకు భారత సాయుధ దళాల్లో ప్రవేశానికి కావాల్సిన శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 310 మంది కెడెట్లు శిక్షణ తీసుకుంటారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కరీంనగర్, జగిత్యాల, సిద్దిపేట, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులకు అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ ఈ నెల 16 నుంచి మే 25 వరకు నిర్వహిస్తామని, దీనికి దాదాపు 350 కెడెట్లు హాజరవుతారని తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్, లీడర్‌షిప్ క్వాలిటీస్, ఎన్‌సీసీ ట్రైనింగ్, ఫైరింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిబిరాలకు కావాల్సిన ఏర్పాట్లను 9వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ అధికారులు మేజర్ సాగర్ సింగ్, సుబేదార్, సూర్యప్రకాశ్, కిట్స్ యాజమాన్యం, అధ్యాపకులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

అల్ఫోర్స్‌లో ముగిసిన ఒలింపియాడ్ ఫౌండేషన్ తరగతులు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, మే 10 : జిల్లా కేంద్రంలో జిల్లా విద్యాశాఖ, అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో కలెక్టర్ పమేలా సత్పతి సారథ్యంలో జరుగుతున్న ఒలింపియాడ్ ఫౌండేషన్ తరగతుల ముగింపు కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. దీనికి జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, రామడుగు ఎంతమో వేణు, ఒలింపియాడ్ సమన్వయకర్త అశోక్ రెడ్డి, గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి హాజరై ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు గణితం, సైన్స్‌లో పట్టు సాధించి, ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడే అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.

డిప్లామా కోర్సులకు దరఖాస్తు గడువు 16

కలెక్టరేట్, మే 10: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో పాలిటెక్నిక్ డిప్లామా కోర్సుల్లో ప్రవేశాలకు జిల్లాలో పదో తరగతి పూర్తి చేసిన బాలికలు ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి తెలిపారు. తల్లిదండ్రులు కోల్పోయిన అనాథలు, తల్లి లేదా తండ్రి లేని బాలికలు, ఇతర కారణాలతో నిరాశ్రయులైన వారు, చిల్డ్రన్ హోమ్, మహిళా సంస్థల్లో పెరిగిన బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికలతో పాటు దివ్యాంగ బాలికలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 240 సీట్లు ఉండగా, పైన పేర్కొన్న వారందరికీ 70శాతం సీట్లు రిజర్వు చేసినట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు ఈనెల 16లోగా జిల్లా పరిషత్ కార్యాలయంలోని రెండో అంతస్థులో గల బాలల పరిరక్షణ విభాగం కార్యాలయంలో అందజేయాలని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం 9490881098 నెంబర్‌లో సంప్రదించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్

తెలంగాణచౌక్, మే10: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో శనివారం ప్రయాణికుల రద్దీ పెరిగింది. గురుకుల జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్ష ఉండడం, వారంతం కావడంతో ప్రయాణికులతో బస్టాండ్ ఆవరణ నిండిపోయింది. ఎండ తీవ్రత ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బస్సుల్లో సీట్ల కోసం పోటీ పడ్డారు. ఏటీఎం సురేశ్ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేశారు. కాగా, హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ రూట్లలో బస్సులను అదనంగా నడిపించినట్లు ఏటీఎం తెలిపారు. బస్టాండ్‌లో హోటల్స్ కిరాయి చెల్లించని కారణంగా మూసి ఉండడంతో టిఫిన్స్, భోజనం కోసం బయట హోటల్స్‌కు వెళ్లాల్సి రావడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు హోటల్స్‌ను తెరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బంగారు నగలు, బ్యాగు అందజేత

బాధిత మహిళకు నగలు అందిస్తున్న పోలీసులు

చిగురుమామిడి, మే 10 : ఆటోలో ప్రయాణించిన ఓ మహిళ తన బంగారు నగలు ఉన్న బ్యాగును అందులోనే మరిచిపోగా, ఎస్ఐ చందబోయిన శ్రీనివాస్ దానిని వెతికించి అందజేశారు. ఈ నెల 6న ముదిమాణిక్యానికి చెందిన ఆడబోయిన అనూష చిగురుమామిడి యూనియన్ బ్యాంకు వద్ద ఆటో దిగి ఆటోలో బ్యాగు మరిచిపోయింది. బ్యాగులో 2.2 తులాల బంగారం, చెవి కమ్మలు, రింగు, లాకెట్ ఉండడంతో పోలీసులను ఆశ్రయించగా, పోలీసులు విచారణ జరిపి ఆటో డ్రైవర్‌ను వెతికి అతడి నుంచి బంగారు నగలు, బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ సమక్షంలో అనూషకు ట్రైనీ ఎస్ఐ జగదీశ్వర్, ఎస్సై చందబోయిన శ్రీనివాస్ బ్యాగును అందజేశారు.

జయహో భారత్

- ఇండియన్ ఆర్మీకి వెల్లువెత్తిన మద్దతు
- వివిధ వర్గాల ఆధ్వర్యంలో ర్యాలీలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కార్పొరేషన్/తెలంగాణచౌక్/గంగాధర/హుజూరాబాద్ టౌన్, మే 10: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఉగ్రవాదంపై పోరులో ఇండియన్ ఆర్మీకి మద్దతు వెల్లువెత్తింది. ఈ మేరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో శనివారం చేపట్టిన ర్యాలీలు, ఆలయాల్లో పూజలతో దేశభక్తి వెల్లివిరిసింది. నగరంలో జర్నలిస్టులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. టీయూడబ్ల్యూజే ఐజేయూ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు జాతీయ జెండాలను చేతబూని పాల్గొన్నారు. తెలంగాణ చౌక్‌కు చేరుకొని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఇటీవల సరిహద్దు వద్ద జరిగిన కాల్పుల్లో మృతిచెందిన భారత జవాన్ మురళీనాయక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే–ఐజేయు అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత సైన్యం విజయం సాధించాలని రజక హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ కుమార్ ఆధ్వర్యంలో భగత్ నగర్‌లోని మడేలయ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, శ్రీకాంత్, మధు పాల్గొన్నారు. అలాగే

హుజూరాబాద్ టౌన్: అంబేద్కర్ చౌరస్తాలో సైనికులకు సంఘీభావం తెలుపుతున్న హాకీ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు

హుజూరాబాద్ పట్టణంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు అవధానుల భాస్కర శర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొలిపాక శంకర్, ఈవో, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, హనుమాన్ దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే హుజూరాబాద్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానం నుంచి పలు వీధుల గుండా జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ అంబేద్కర్ కూడలి వరకు చేరుకొని భారత సైన్యానికి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, హాకీ క్లబ్ జిల్లా ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు భూసారపు శంకర్, సెక్రటరీ బొడిగె తిరుపతి, మాజీ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, హాకీ క్లబ్ సభ్యులు గుడ్డెల్లుల సమ్మయ్య, వేముల రవికుమార్, భూసారపు వెంకటేశ్వర్లు, ఎండీ యూసుఫ్, ఎండీ సజ్జు, నిమ్మటూరి సాయి కృష్ణ, మాటూరి రాజేశ్, కాయకంటి రాజేశ్, సబ్బని విక్రం, కోచ్ మోటపోతుల విక్రం, వినయ్, విపుల్, రాజ్ కుమార్, వంశీ, క్రీడాకారులు పాల్గొన్నారు. గంగాధర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ఇండియన్ ఆర్మీకి మద్దతుగా శనివారం చిన్నారులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకుడు పుట్కం ఠాగూర్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న జర్నలిస్టులు

హుజూరాబాద్ టౌన్: హనుమాన్ ఆలయంలో పూజల్లో పాల్గొన్న మాలధారులు

అప్పు విషయంలో ఇద్దరి నడుమ వివాదం

- మనస్తాపంతో రుణదాత ఆత్మహత్యాయత్నం

శంకరపట్నం, మే 10: అప్పు విషయంలో ఇద్దరు వ్యక్తుల నడుమ వివాదం చెలరేగగా, రుణం ఇచ్చిన వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల కథనం ప్రకారం.. శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన మర్రి సమ్మయ్య వద్ద అదే గ్రామానికి చెందిన రైతు మురళీధర్‌రెడ్డి అప్పు తీసుకున్నాడు. ఇటీవల అప్పు తీర్చాలని సమ్మయ్య అడిగితే మురళీధర్‌రెడ్డి స్పందించలేదు. ఈ క్రమంలో సమ్మయ్య మురళీధర్‌రెడ్డి ధాన్యాన్ని విక్రయించకుండా అడ్డుకున్నాడు. చివరకు అప్పు విషయంలో గొడవ పెద్దది కాగా, శనివారం కేశవపట్నం పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. పోలీస్ స్టేషన్ వద్ద సమ్మయ్య రైతుకు రూ.2 లక్షలు అప్పు ఇచ్చానని వాదించగా, రైతు మాత్రం కేవలం రూ.లక్ష మాత్రమే బాకీ ఉన్నానని చెప్పాడు. ధాన్యాన్ని అమ్ముకోకుండా అడ్డుకున్నందున ట్రైనీ ఎస్ఐ సుమన్‌రెడ్డి సమ్మయ్యపై కేసు నమోదు చేశారు. జరిగిన ఘటనతో మనస్తాపం చెందిన సమ్మయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని హుజూరాబాద్ దవాఖానకు చికిత్సకు తరలించారు.

31లోగా ఓపెన్ డిగ్రీ ఫీజు చెల్లించాలి

కమాన్‌చౌరస్తా, మే 10: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ తృతీయ సంవత్సరం 6వ సెమిస్టర్, డిగ్రీ ద్వితీయ సంవత్సరం 4వ సెమిస్టర్, డిగ్రీ ప్రథమ సంవత్సరం 2వ సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా మే 31వ తేదీలోగా చెల్లించవచ్చని ప్రాంతీయ సమన్వయ అధికారి డాక్టర్ వంగల శ్రీనివాస్, ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సైన్స్, కంప్యూటర్ ప్రాక్టికల్ చేయాల్సిన విద్యార్థులు థియరీ పేపర్‌తో పాటు ప్రాక్టికల్ పేపర్‌కు కూడా రిజిస్ట్రేషన్ చేసుకొని ఫీజు చెల్లించాలని తెలిపారు. డిగ్రీ తృతీయ సంవత్సరం 6వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 20 నుంచి 25వ తేదీ వరకు, డిగ్రీ ద్వితీయ సంవత్సరం 4వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 26 నుంచి జూలై 2వ తేదీ వరకు, డిగ్రీ ప్రథమ సంవత్సరం 2వ సెమిస్టర్ పరీక్షలు జూలై 4 నుంచి 10వ తేదీ వరకు మధ్యాహ్నం సమయం 2 గంటల నుంచి 5 గంటల వరకు కొనసాగుతాయని వివరించారు.

అధికారులతో సమీక్షిస్తున్న సీపీ గౌష్ ఆలం

విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

- వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలి
- టౌన్ డివిజన్ అధికారులతో సమీక్షలో సీపీ గౌష్ ఆలం

కరీంనగర్, మే 10 (నమస్తే తెలంగాణ) : టౌన్ డివిజన్ పోలీసు అధికారులతో టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీపీ గౌష్ ఆలం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, టౌన్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ప్రార్థనా మందిరాలు, షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్ ప్రాంతాల వంటి రద్దీ ప్రదేశాల్లో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలు పెంచాలని ఆదేశించారు. ప్రధాన కూడళ్ల వద్ద స్టాటిక్ పికెట్స్ తో పాటు పలుచోట్ల వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని, అనుమానాస్పద వ్యక్తులను విచారించి వారి వేలిముద్రలు సేకరించాలని తెలిపారు. ఈ తనిఖీల్లో స్థానిక పోలీసులతో పాటు డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్‌ల సిబ్బంది కూడా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తనిఖీల్లో పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌లను వినియోగించాలన్నారు. ముఖ్యంగా ప్రజలు ఎక్కువగా సంచరించే బస్టాండ్లు, ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటును క్రమంగా పర్యవేక్షించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు కాల్ చేయాలని ప్రజలకు సూచించాలని కోరారు. ముఖ్యమైన, సున్నిత ప్రాంతాల్లో భద్రతను మరింత పెంచాలని, సోషల్ మీడియాపై నిరంతర నిఘా ఉంచడం అవసరమని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. సమావేశంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్‌స్పెక్టర్లు బిల్లా కోటేశ్వర్ (వన్ టౌన్), సృజన్ రెడ్డి (టూ టౌన్), జాన్ రెడ్డి (త్రీ టౌన్), మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు తక్షణమే అమలు చేయాలి

హుజూరాబాద్ టౌన్, మే 10: కాంగ్రెస్ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని హుజూరాబాద్ 30వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసరి మధుకర్ రావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయడంలేదని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేసి, ప్రతి ఉద్యమకారుడికి 250 చదరపు గజాల విస్తీర్ణంలో ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని తెలిపారు. నిరుద్యోగులకు భృతి ఇస్తామని ఇవ్వకపోవడమే కాక, సిబిల్ స్కోర్ ఉంటేనే రాజీవ్ యువ వికాసం పథకం వర్తిస్తుందని మెలిక పెట్టడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థుల కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి ఇంటికీ ఏదో ఒక సంక్షేమ పథకం అందిందని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించారని పేర్కొన్నారు.

సీఐని కలిసిన బీసీ నాయకులు

హుజూరాబాద్ టౌన్, మే 10: ఇటీవల బదిలీపై వచ్చి హుజూరాబాద్ టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన టీ కరుణాకర్‌ను తెలంగాణ బీసీ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో బీసీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర నాయకులు చందుపట్ల జనార్ధన్, సందేల వెంకన్న, హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్ ఆకుల సదానందం, బీసీ నాయకులు ఉప్పు శ్రీనివాస్, బుడిగ జంగాల నాయకులు పూసపాటి వేణు, బొంగోని వెంకటయ్య, తాళ్లపల్లి అమరేందర్, గంగిశెట్టి జగదీశ్వర్, దాసరి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన

హుజూరాబాద్ టౌన్, మే 10: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై ఏపీ పోలీసులు దాడి చేయడంపై పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం స్థానిక జర్నలిస్టులు నిరసన తెలిపారు. వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాత్రికేయులపై దాడులు మానుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

నిప్పంటుకొని వడ్లు దగ్ధం

వల్భాపూర్‌లో కాలిపోయిన వరిధాన్యంను చూపిస్తున్న మహేందర్

వీణవంక, మే 10: వల్భాపూర్ గ్రామంలో నాలి మహేందర్‌కు చెందిన నాలుగు ఎకరాల వడ్లు నిప్పంటుకొని దగ్ధమయ్యాయి. రైతు కథనం ప్రకారం.. నాలి మహేందర్ పొలాన్ని కౌలుకు తీసుకొని వరిసాగు చేశాడు. ఫిమేల్ వడ్లను ఆర్గనైజర్ తీసుకుపోగా, మగ వడ్లను కుప్పపోసి ఉంచాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించగా గడ్డితో పాటు నాలుగు ఎకరాల మగవరి ధాన్యం కాలిపోయింది. సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని నాలి మహేందర్ కోరాడు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణచౌక్, మే 10: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ పిలుపునిచ్చారు. హరిత బయో ప్రొడక్ట్స్ కంపెనీలో శనివారం కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ వ్యాప్త సమ్మెలో 29 జాతీయ కార్మిక సంఘాల పాల్గొంటున్నాయని తెలిపారు. కార్మికులు పోరాటాలతో హక్కులను సాధించుకోవాలన్నారు. సమ్మెపై కార్మికులను చైతన్యపరిచేందుకు గ్రామ, మండల, జిల్లా పరిధిలో సమ్మె కరపత్రాలను పంపిణీ చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలన్నారు. సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, తిరుపతి, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

ఆకునూర్‌లో ఈదురుగాలులకు లేచిపోయిన ఇంటి పైకప్పు

సైదాపూర్, మే 10: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులకు ఆకునూర్ గ్రామంలో నెల్లి మొగిలికి చెందిన ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. ఆకునూర్–గొల్లగూడెం మధ్య రహదారిపై చెట్టు విరిగి పడింది. పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తమ వడ్లను కాపాడుకునేందుకు కవర్లు కప్పుతూ ఇక్కట్లు పడ్డారు.

దేశ రక్షణ నిధికి విరాళం అందజేత

గంగాధర, మే 10: ఇండియా, పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో ఇండియన్ ఆర్మీకి సంఘీభావం తెలుపుతూ దేశ రక్షణ నిధికి ఒక నెల వేతనాన్ని విరాళంగా అందజేసినట్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పహల్గాంలో అమాయకుల ఉసురు తీసిన ఉగ్రవాదులకు, వారిని భారత్‌పై ఉసిగొల్పుతున్న పాకిస్థాన్‌కు ఆపరేషన్ సిందూర్‌తో ఇండియా తగిని బుద్ధి చెప్పిందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయులు ప్రతి ఒక్కరూ భారత సైన్యానికి మద్దతుగా నిలువాలని కోరారు. సరిహద్దులో పాకిస్థాన్‌తో వీరోచిత పోరాటం చేస్తున్న సైన్యానికి మద్దతుగా చొప్పదండి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తమకు తోచిన విధంగా విరాళాలు అందజేయాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 10: రేకుర్తిలో 33కేవీ లైన్ షిఫ్టింగ్ పనులు చేపడుతున్నందున ఆదివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ రఘు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8నుంచి 11.30గంటల వరకు రేకుర్తి, జగిత్యాల రోడ్డు, సీతారాంపూర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత

ముకరంపుర, మే 10: నగరంలోని 33కేవీ అంబేద్కర్, 33కేవీ టవర్ సర్కిల్ ఫీడర్‌లో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్న సిబ్బందికి శనివారం నగరానికి చెందిన డాక్టర్ రఘురామన్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. ఎండ ప్రభావానికి గురవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో టౌన్ డీఈ జంపాల రాజం, ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్, టౌన్ –1, 5 ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పీవీ రావు ఆశయాలు కొనసాగించాలి

తెలంగాణచౌక్, మే10: దళిత సామాజిక ఉద్యమకారుడు పీవీ రావు ఆశయాలను కొనసాగించాలని మాల సంఘాల జేఏసీ చైర్మన్ బొగ్గుల మల్లేశం పిలుపునిచ్చారు. పీవీ రావు 73వ జయంతిని పురస్కరించుకొని నగరంలోని కోర్టు చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో దళిత సమాజాన్ని చైతన్య పరిచిన పీవీ రావు మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, నాయకులు పటాకుల భూమయ్య, వివేక్, రవీందర్, సన్నీ, రిషి పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీజీఆర్‌జేసీ ప్రవేశపరీక్ష

పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న డీఆర్‌వో వెంకటేశ్వర్లు

కలెక్టరేట్, మే 10 : ప్రభుత్వ గురుకుల కళాశాలల ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పరీక్ష ప్ర